# గెలుపెవరిది?

**ఆంధ్రభూమి, 22 ఆగస్టు 1998**



కూతురు ఎవరితోటో ప్రేమలో పడిందన్న విషయం తెలిసి కృష్ణమూర్తి గిజగిజలాడిపోయాడు. మొదట నమ్మలేకపోయాడు. తర్వాత లావణ్యాని మరెవరి స్కూటరు మీదో చూసాక నమ్మక తప్పలేదు. కూతురు అడక్కుండానే అన్నీ అమర్చిపెడుతున్నాడు తను. అలాంటిది పెళ్ళి విషయంలో మాత్రం ఎందుకిలా తొందరపడాలి? అతని అహం దెబ్బతింది.

కానీ... ప్రేమనేది అహానికీ అభిజాత్యానికీ సంబంధించిన విషయం కాదని అతనికి తెలీదు. అతనికి తెలిసిందల్లా ఆస్తి, అంతస్తూ... అతని తల్లి బోలెడంత ఆస్తితో వచ్చింది. భార్యకి యాభైకాసుల బంగారం పెట్టి లక్షన్నర కట్నం యిచ్చారు. కృష్ణమూర్తి కొడుక్కి పదిహేను లక్షలు తీసుకున్నాడు. లావణ్యకీ అలాగే యివ్వడానికి సమాయత్తపడుతున్నాడు. ఇవన్నీ ఆ కుటుంబంలోని వాళ్ళతో అతనికి గల లావాదేవీలు. ఇంకా చాలా యితరత్రమైన వ్యాపకాలు. అయితే వీటన్నిటికీ అతీతంగా అప్పడప్పుడు అతనికనిపిస్తుంది తన జీవితం యిలా కాకుండా మరోలా వుంటే బావుంటుందని. తల్లిని చూసినప్పుడే అతనికలా అనిపిస్తుంది.

అతనికి వూహ తెలిసినప్పట్నుంచీ ఆవిడ నిశ్శబ్దాన్నీ, వంటరితనాన్నీ అభిలషించటమే చూస్తున్నాడు. మనిషిలో ఒక విధమైన నిరాసక్తత! ఒక్కర్తీ కారిడార్లో యీజీ చెయిర్ వేసుకుని కూర్చుని ఏదో ఆలోచిస్తూ వుంటుంది. ఎవర్తోటీ ఎక్కువగా మాట్లాడదు. కృష్ణమూర్తి తండ్రికి మరో కుటుంబం వుంది. అక్కడ పొద్దుపోయేదాకా గడిపి యింటికొస్తాడు. ఎంత పొద్దుపోయినా యిక్కడికి రావాలనే వప్పందం వాళ్ళ మధ్య వుండి వుండచ్చు. అందుకే వస్తాడేమో ఆయన! ఆయన వచ్చాక అప్పుడావిడ లోపలికొస్తుంది. అలా వచ్చాక కూడా ఆయన అవసరాలని చూసి, మళ్ళీ చీకట్లో కూర్చుని నిద్రలేని రాత్రులని వెలుగువాకిట్లోకి చిమ్మెయ్యటం ఎన్నోసార్లు చూసాడు.

ఏమిటిది? ఆవిడ జీవన వైఫల్యమా? ఆయన ప్రేమరాహిత్యమా? ఏది? ఆవిడలోని యీ నిర్లప్తతకీ, నైరాశ్యానికీ జవాబుదారీ? ఈ ప్రశ్నలు కృష్ణమూర్తిని తరుచుగా వేధిస్తుంటాయి. తల్లి యిలా కాకుండా  మరోలా వుండి వుంటే తన చిన్నప్పటి రోజులన్నీ చైతన్యవంతంగా వుండి వుండేవన్న భావన కలుగుతుంది. తన చిన్నతనమంతా ఎంత నిస్సారంగా గడిపాడో గుర్తొస్తుంది. తల్లి తనకేం కావాలో చూసేది అంతే. ఎప్పుడన్నా తన మాటలకి మురిసినా అది కాస్సేపే. అంతలోనే ఏవో విషాదమేఘాలు ఆమెని కమ్ముకొనేవి. అమ్మ ఎందుకు అలా విరాగిలా ఉంటుందో చదువు పూర్తయి, సంసారంలో పడినా తనకి అర్థం కాలేదు.

లావణ్యది పూర్తిగా నాయనమ్మ పోలిక. కూతురిలో తన చూడలని తల్లి బాల్యాన్ని, పెద్దగా

జ్ఞాపకంలేని ఆవిడ యవ్వనదశనీ వెతుక్కుంటాడతను. కూతురి సుఖ సంతోషాల కోసం ఏదైనా చేయగలడతను. ఐతే ఆ సుఖసంతోషాలు అతని కోణం లోంచీ ఆవిష్కరింపబడినవే. ఇప్పుడీ ప్రేమ వ్యవహారం అతనికి సమస్యగా పరిణమించింది. ఎవరా కుర్రాడు? ఏం చేస్తుంటాడు? తల్లిదండ్రులెవరు? ఇత్యాది వివరాలన్నీ సేకరించాక హతాశుడైపోయాడు. ఆ వివరాల్లో అతి ముఖ్యమైనది అతనారోజు నడిపిన స్కూటరు అతని ఫ్రెండుదనే విషయం. అతనికో డొక్కు సైకిలు మాత్రమే వుంది! అలాంటివాడిని కూతురెలా ప్రేమించిందనేది మిలియన్ డాలర్ క్వెశ్చనైపోయింది. కూతురు నొచ్చుకోకుండా యీ వ్యవహారాన్ని ఎలా సెటిల్ చెయ్యాలా అనే ఆలోచన అతన్లో మొదలైంది.

★★★

రాత్రి భోజనాలు చేస్తున్నప్పుడు "లావణ్యకి పెళ్ళి చేసేస్తే ఎలా ఉంటుంది?" అన్నాడు.

"మనకున్న ఆ వొక్క బాధ్యతా తీరిపోతుంది" అని నవ్వింది భార్య. ఆమెకి ఆ ప్రతిపాదన వెనుక కారణం తెలీదు.

"నా ఫ్రెండు కొడుకు డాక్టర్. పది లక్షల దాకా ఆఫర్సొస్తున్నాయట ఆ ప్రొఫెషన్లో లేని అమ్మాయి కోసం చూస్తున్నాడు. మనకి తగిన సంబంధం".

ఈ సంభాషణ జరుగుతున్నప్పుడు లావణ్య కూడా అక్కడే వుంది. ఏమైనా అంటుందేమోనని చూసాడు కృష్ణమూర్తి. కానీ ఏమీ మాట్లాడలేదు. కొంత మధనపడి, మరికొంత సందిగ్ధపడి చివరికి భోజనాలయ్యాక వెళ్ళి తండ్రి గదిలో కూర్చుంది.

ఆమె ఎందుకొచ్చిందో కృష్ణమూర్తి గ్రహించాడు. చాలా డిప్లొమేటిగ్గా, పాము చావకుండా, కర్ర విరగకుండా వ్యవహారాన్ని సెటిల్ చెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

"ఏంటమ్మా? ఏదైనా మాట్లాడాలా?" మృదువుగానే అడిగాడు.

"డాడీ! నేనొకతన్ని ప్రేమిస్తున్నాను." అంది లావణ్య తలొంచుకుని.

"తెలుసు" కృష్ణమూర్తి కూల్‌గా అన్నాడు.

"తెలుసా?" విస్మయంగా అంది లావణ్య. "తెలిసీ నన్ను ప్రదీప్‌కి ఎలా ప్రపోజ్ చేసారు?"

"తర్వాత చెప్తాను గానీ ఎవరతను?"

"సారధి అని నా క్లాస్‌మేట్. టీచర్‌గా చేస్తున్నాడు".

"ఎంతొస్తుంది జీతం?"

"ఐదువేలేమో!"

"కాదు పన్నెండొందల డబ్బై అయిదనుకుంటాను. కన్సాలిడేటెడ్ పే. అలా కొన్నేళ్ళు చేసాక నువ్వు చెప్పిన ఐదువేలు యిస్తారేమో!"

"కావచ్చు డేడీ! నేనెప్పుడూ అడగలేదు"

"అతని తండ్రి ప్రైవేటు స్కూల్లో టీచర్. ఇద్దరు చెల్లెళ్ళు పెళ్ళికున్నారు. అతనికొచ్చే కట్నంతో వాళ్ళని వదిలించుకోవాలి"

"ఇవన్నీ మీకెలా తెలుసు?"

"ఇప్పుడు చెప్పు, ప్రేమంటే ఏమిటి?"

"ఇద్దరు వ్యక్తులు లౌకికావలసరాలకి అతీతంగా ఒకరినొకరు కావాలనుకోవడం?"

"నువ్వు టైటానిక్ చూసావా?"

తండ్రి ప్రశ్న అసందర్భంగా తోచిందేమో తెల్లబోయి చూసింది లావణ్య. మళ్ళీ ఏమనుకుందో చూసినట్టు తలూపింది.

"అందులో ప్రేమికులు... రోజ్, జాక్ కదూ? వాళ్ళ ప్రేమకథ చాలా టచింగ్‌గా వుంది కదూ? కానీ నా ఉద్దేశం చెప్పనా?...వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకోలేకపోయారుగాబట్టి అది ఎటర్నల్ లవ్వైంది. అదే పెళ్ళి చేసుకుని వుంటే మర్నాడే విడాకులకి పరిగెత్తేవారు".

లావణ్య ముఖం ఎర్రబడింది. తండ్రి ఏం చెప్పబోతున్నాడో అర్థమైంది. "ఎందుకని"? చురుగ్గా అడిగింది.

"కల్చర్ డిఫరెన్స్"

"అంటే మీ వుద్దేశ్యం?"

"ఆ సారథికీ మనకీ పొసగదు. నువ్వు 'ప్రేమ' అనుకుంటున్నది ఈ వయసులో అందర్లోనూ వుండే ఆకర్షణ శక్తి. కొంతకాలానికి అది బలహీనపడ్తుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే మనందరం కాలమనే ప్రవాహంలో కొట్టుకుపోతున్నాం. నువ్వు చెప్పిన ప్రేమ అందులో గడ్డిపరక. గడ్డిపరకని పట్టుకుని ఎవరూ ప్రవాహం యీదరు. నువ్వా సారథిని చేసుకుని జీవనయానం చేద్దామనుకుంటున్నావే, ఆ ఆకర్షణ రెండో రోజుకల్లా వీగిపోతుంది. ఈ పెళ్ళెందుకు చేసుకున్నానా అని రెండో రోజునుంచే యిద్దరు పశ్చాత్తాపపడ్తారు."

"మీరు చాలా డేమేజింగా మాట్లాడుతున్నారు డాడీ!"

"నీకలా అనిపిస్తోంది. నేను అనుభవంతో చెప్తున్నాను"

"మీకూ మాకూ జనరేషన్ గేప్ వుంది. మీకు పెళ్ళంటే కట్నకానుకలూ, పెట్టుపోతలతో ముడిపడి వున్నది. ఇప్పటి వాళ్ళం కోరుకుంటున్న ప్రేమ గురించి తప్పు అభిప్రాయంతో వున్నారు?"

"నువ్వు కష్టపడతావని భయమమ్మా! దేవుడు మనిషికి ఒకటే జీవితాన్నిచ్చాడు. తప్పులు చేసినా సరిదిద్దుకున్నా అందులోనే. పెళ్ళి విషయంలో ట్రయల్ అండ్ ఎర్రర్ వుండకూడదు".

"మీరెన్నైనా చెప్పండి. నేనతన్నే చేసుకుంటాను. జీవితాన్ని అందంగా మలచుకోవడం ఎలాగో నాకు తెలుసు. మీ కూతుర్నేగా" ఛాలెంజ్‌గా అంది లావణ్య.

కృష్ణమూర్తికి కూతురి పట్టుదలా, వాదనా చాలా ముచ్చటనిపించాయి. కానీ అవింకే విషయంలోనైనా అయితే ఎంజాయ్ చేసేవాడు. ఈ విషయంలో గాబట్టి ఆ మురిపాన్ని మనసులోనే వుంచుకుని తన ఆఖరి ఆయుధాన్ని తీసాడు.

"అతనేం చదివాడు?"

"ఎమ్మెస్సీ మేథ్స్.. పీజీ డిసియ్యే"

"ఐనా పన్నెండొందలకి చేస్తున్నాడు"

"దేశమే అలా వుంది" నిరసనగా అంది. అందులో బాధ కూడా వుంది.

కృష్ణమూర్తి ఆమెకేసి చూసి, "అతని సమస్యలనీ, కష్టాలనీ పంచుకుందుకు, నీకున్న వన్నీ వదిలి పెట్టేందుకు నువ్వు రెడీగా వున్నావు. మరతను? నిన్ను చేసుకోవడం ద్వారా తనకి రావాల్సిన కట్నాన్ని వదులుకుని తద్వారా సునాయాసంగా చెల్లెళ్ల పెళ్ళిళ్ళు చెయ్యగలిగే అవకాశాన్ని వదులుకుని, వున్నవాటికి తోడుగా, కొత్త సమస్యల్నీ, బాధ్యతల్నీ అందుకోవడానికి సుముఖంగా వున్నాడా? ఐమీన్... ఎలానూ నా ఆస్తికి నువ్వే వారసురాలివని నిన్నతను ట్రాప్ చేస్తున్నాడేమోనని" అన్నాడు.

"ఛ. సారథి అలాంటివాడు కాదు."

"ఓకే. లీవిట్. డబ్బు ద్వారా వచ్చే సుఖాలని నువ్వనుభవించావుగాబట్టి వాటిని త్యాగం చెయ్యడానికి రెడీగా వున్నావు. అతనలాంటి సుఖాలే ఎరగడు. కాబట్టి బెటర్‌లైఫ్ ఆశించడా? వున్న ప్రివిలేజెస్ కూడా వదులుకోవడానికి మనస్ఫూర్తిగా యిష్టపడుతున్నాడా?"

"డేడీ!"

"మనిషి కష్ట సుఖాలన్నీ డబ్బుతో ముడిపడి వున్నాయి. లావణ్యా! డబ్బు లేకుండా కూడా సుఖ పడగలమని ఎవరేనా అంటే అది ఆత్మవంచనవుతుంది. నేను సారధికి మంచి వుద్యోగం వేయిస్తాను. అప్పుడు తన బతుకేదో తన బతుకుతాడు నువ్వు తన్ని మర్చిపో. లేదంటావా, కట్టుబట్టల్తో యింట్లోంచీ వెళ్ళిపో... నీ కర్మ. నేను కలగజేసుకోను. ఎందుకంటావేమో. అది కూడా చెప్తాను. నేను నిలబడి మీ పెళ్ళి చేస్తే అతను డబ్బుకోసం నీద్వారా నన్ను స్క్వీజ్ చెయ్యడం మొదలుపెట్టవచ్చు. అది నాకు నచ్చదు".

"కానీ డాడీ మీరు ప్రదీప్‌కి పది లక్షలు ఇవ్వడానికి సిద్ధమయ్యారు కదా!"

"నిజమే! అతడికి నేనా పదిలక్షలు ఇచ్చినా, ఇవ్వకపోయినా ఒకటే. కాని సారధికలా కాదు. డబ్బు అవసరం చాలా ఉంది. ఆ అవసరం మనిషిచేత ఎంతపనైనా చేయిస్తుంది."

లావణ్య లేచి నిల్చుంది. "ఆలోచించుకుని చెప్తాను" అని అక్కణ్ణుంచి వచ్చేసింది.

సరిగ్గా ఎక్కడ బ్రేక్ చెయ్యాలనుకున్నాడో అక్కడే బ్రేక్ చేసాడు కృష్ణమూర్తి లావణ్యని. ఆమె ఆలోచనలో పడింది. సారధికి కట్నం తీసుకుని తొందరగా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసేసి, బాధ్యతల్ని తీర్చేసుకుని తన బతుకేదో తను నిశ్చింతగా బతకాలనుందేమో! దానికి తను అడ్డుపడ్తోందేమో! అతనికి తండ్రి మంచి వుద్యోగం వేయిస్తే సమస్యలన్నీ తీరిపోయి సంతోషంగా వుంటాడేమో ననిపించింది. అలా కాకుండా మరో ఆలోచన కూడా కలిగింది లావణ్యకి. పిత్రార్జితమైన ఆస్తుల్లో తనవాటా తనకిమ్మని అది తీసుకుని అతని దగ్గరికి వెళ్ళిపోవచ్చు. దానికతను ఏమంటాడనేది తర్వాత విషయం. కని పెంచిన తల్లిదండ్రులని అలా అడగడానికి, ఆశలన్నీ తనమీదే పెట్టుకుని బతుకుతున్న వారిని బాధపెట్టడానికి ఆమె మనస్సు వప్పుకరోలేదు. సరిగ్గా ఎక్కడైతే పురుషుడు సమాజంమీద పట్టుసాధిస్తున్నాడో, అక్కడే, స్త్రీ ఆత్మవితరణతో పట్టుని కోల్పోతోంది.

ఎంతో ఆలోచించాక లావణ్య ప్రదీప్‌తో పెళ్ళికి వప్పుకుంది.!

★★★

"ఐతే లావణ్యకి ఆ డాక్టరు సంబంధం ఖాయం చేద్దామనా?" ఎప్పుడూ ఏ విషయంలోనూ కలగజేసుకోని తల్లి తనని అలా అడగటంతో ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి. ఆవిడ ప్రశ్న పైకి సౌమ్యంగా ధ్వనించినా, అందులో కనిపించని అలజడేదో వుందనిపించింది.

"ఔనమ్మా! మంచి సంబంధం. అందరికీ నచ్చాడు. కుర్రాడు బాగా పైకొస్తాడు. కట్నం దగ్గిర పేజీల్లేవు. మన స్టేటస్‌కి తగిన సంబంధం" అన్నాడు.

"అవన్నీ సరే! లావణ్యకి నచ్చాడా?"

ఆవిడ ప్రశ్నకి డైనమైటు పేల్చినట్టు కృష్ణమూర్తిలో పెద్ద సంచలనం! అది ఎరగక చెప్పుకు పోతోందావిడ. "నాకెందుకో అదీ పెళ్ళికి సుముఖంగా లేదనిపిస్తోంది. దేనికో రాజీపడ్తూ వప్పుకున్నట్టుంది తప్ప మనస్ఫూర్తిగా యిష్టపడుతున్నట్టు లేదు. దాని మొహంలో పెళ్ళికళే లేదు".

"దాని మొహం చిన్న పిల్ల. దానికేం తెలుసు? పెద్దవాళ్ళం ఏం చేసినా పిల్లల మంచి కోసమేకదా?" నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ అన్నాడు.

"మంచంటే? డబ్బూ, హోదా, ఐశ్వర్యం... యివేనా? ఒకసారి అడిగి తెలుసుకో, అదెవరికేనా మనసిచ్చిందేమో! అతను దాని కింత తిండిపెట్టగల యోగ్యుడైతే చాలు. తక్కినవన్నీ మనమే యివ్వగలం."

"దొంగ తిరుగుడొద్దు. అది నీకేం చెప్పింది?" తనగొంతు తనకే కఠినంగా వినిపించిందతనికి.

ఆవిడ నిస్తేజంగా నవ్వింది. "నోరిప్పి అదేం చెప్తుంది? దాని మనసులో ఏముందో మనమే తెలుసుకోవాలి. అలా చెప్పుకోగలిగే స్వేచ్ఛ ఆడదానికి ఎవరు, ఎప్పుడిచ్చారు గనుక?" అంది.

కృష్ణమూర్తి అప్రతిభుడయ్యాడు. తల్లేనా యిలా మాట్లాడుతోంది? తనకన్నా ఒక తరం వెనకటి మనిషి. ఒక తరం ముందుకి చేరి మాట్లాడుతోంది? ఆస్తీ, అంతస్తూ, కులగోత్రాలూ... యివేవీ వద్దనుకుంటే మనిషికి వున్నవేమిటని?

"నీ చిన్నతనం నుంచీ నన్ను గమనిస్తున్నావు. గుండెల్లో నిర్వేదం. కళ్ళల్లో నిస్తేజం. బతుకులో నిర్లిప్తత. నీ భార్యనీ చూస్తున్నావు. మా యిద్దరికీ తేడా లేదా? తల్లి నుంచీ జీవన మాధురిని సంపూర్ణంగా అందుకున్న నీ కూతురికీ, అది అందుకోని నీకూ తేడా లేదా? ఒక్కసారి నీకు నువ్వే ఆలోచించుకో. ఇంటిని చేతనా ప్రవంతిని చేసేది స్త్రీ - యిల్లాలు. తనలోని జీవచైతన్యాన్ని పిల్లలకి పంచియిచ్చి కొత్త కుటుంబాలకి పునాది వేస్తుంది. ఆమే ఒక జడపదార్థమయ్యాక యింకొకళ్ళకి ఏమిస్తుంది? అర్థం చేసుకో. పెళ్ళంటే రెండు శరీరాల అనుసంధానం కాదు. ఆ శరీరాల్లోని మనసుల కలయిక, సహజీవనం వలన కొంత కాలానికి భార్యాభర్తల్లో ప్రేమ పుడ్తుంది. కానీ ఒక వ్యక్తిని ప్రేమించాక మరో వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం నరకసదృశం. అనేక సమస్యలకి మూలం".

తల్లిగొంతు వణకటాన్ని స్పష్టంగా విన్నాడు కృష్ణమూర్తి. అతన్ని ఆలోచనకి అలాగే వదిలేసి ఆవిడ నిశ్శబ్దంలోకి జారిపోయింది.

తల గిర్రుమని తిరిగిపోయింది కృష్ణమూర్తికి. తల్లి... తన తల్లి తండ్రిని కాదని యింకెవర్నైనా ప్రేమించిందా? ఆ ప్రేమలో విఫలమైందా? అదేనా ఆవిడ చెప్పేది?

ఆ క్షణాన్న కూతుర్ని చూడాలన్న బలమైన కోరిక కలిగిందతనికి. ఎందుకో తెలీదు. ఆమె గదిలో లేదు. ఇల్లంతా వెతికితే డాబామీద కనిపించింది. చీకట్లో ఒంటరిగా... సరిగ్గా తన తల్లిలాగే. రేపు ప్రదీప్‌తో పెళ్ళయ్యాక కూడా లావణ్య యిలాగే ఉంటుందా? అందనంత దూరంలో వున్న సారథిని మర్చిపోలేక, గడపుతున్న జీవితంతో రాజీపడలేక... తామరాకుమీద నీటిబొట్టులా నిర్లిప్తంగా .. తల బలంగా విదిల్చాడు. ఇంకా ఆ భావన కొనసాగుతూనే వుంది. లావణ్య యిలా వుంటే ప్రదీప్ ఎందుకూరుకుంటాడు? ఆమెమీద పెళ్ళి పేరిట తనకి లభ్యమైన సర్వహక్కుల్నీ సాగించుకోవాలనుకుంటాడు. సాగుబాటు కాకపోతే బైటి సుఖాలు వెతుక్కుంటాడు తన తండ్రిలా!

కూతురితో తను వాదనలో గెలవగలిగాడుగానీ ఆమెలో జనించిన ప్రేమ ఆమెనే గెలిచింది. ఆమె జీవితాన్నే శాసించబోతోంది. తను చేస్తున్న పొరపాటుని ఏ మాత్రం ఉపేక్షించకుండా సరిదిద్దుకోవాలని అర్థమైంది కృష్ణమూర్తికి.